# పుణ్యమూ- పురుషార్థమూ

మైసూర్ వచ్చి రెండురోజులవుతోంది. మావారు ఇరవై రోజుల క్రితం వచ్చారిక్కడికి... ఆఫీసు పని మీద. మధ్యలో ఓ రెండ్రోజులు సెలవులు రాగానే నేనూ ఆయన్ని వెతుక్కుంటూ వచ్చాను.

వచ్చినప్పటినుంచీ ఎడతెరిపి లేకుండా సైట్‌సీయింగే. గుళ్లు... గోపురాలు... గార్డెన్లు... జూలు... పాలెస్‌లు...ఆర్ట్ గ్యాలరీలు. ఒక చోటునుంచి మరోచోటికి పరుగులు.

ఇక ఇవాళ ఆఖరు. సాయంత్రం నాలుగున్నరకి హైదరాబాద్ బస్సెక్కి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోవాలి. రేపు పొద్దున ఎట్టి పరిస్థితుల్లోనూ ఆఫీస్‌కి వెళ్ళి తీరాలి.

సాయంత్రం నాలుగున్నర లోపల చూడతగ్గ ప్రదేశాలేమున్నాయి! అని ఆలోచించాం తెల్లవారి లేస్తూనే.

"సోమనాథపురం వెళ్దాం" అన్నారు మావారు. "ఇక్కడినుంచి ముప్పై కిలోమీటర్లే. తొమ్మిదింటికల్లా బయల్దేరామంటే... లంచ్ టైమ్‌కి వెనక్కి వచ్చేయవచ్చు. భోజనం చేసి కాసేపు రెస్ట్ తీసుకొని బస్ ఎక్కుదువుగాని" అన్నారు.

సరే అనుకున్నాం. చకచకా రెడీ అయి టిఫినూ, కాఫీ కానిచ్చి ఆర్.టి.సి. బస్‌స్టాండ్ చేరాం. సోమనాథపురానికి డైరెక్ట్ బస్ లేదట. "బన్నూరు దాకా బస్‌లో వెళ్ళి అక్కడినుంచి ఏదన్నా ప్రయివేటు బస్‌లో వెళ్లండి" అన్నారు ఎంక్వైరీలో.

"ఎంత దూరముంటుంది బన్నూరు నుంచి!" మావారు కొద్దిగా హుషారు తగ్గిన స్వరంతో అడిగారు.

"బన్నూరు ఇక్కడికి ఇరవై కిలోమీటర్లు. అక్కడి నుంచి అది ఇంకో పది కిలోమీటర్లు వుంటుంది" అన్నాడాయన. ఆమాట చెప్తూనే "అదిగదిగో బన్నూరు బస్" అని చూపించాడు ఓ కదిలిపోతున్న బస్‌ని.

పరుగెత్తుకు వెళ్ళి ఎక్కాం. కూర్చునే చోటు లేదు. బాగా రష్‌గా వుంది బస్. అయినా వాతావరణం చల్లగా వుండడంవల్ల ఆ కాసేపు నిల్చోవడం పెద్ద కష్టంగా అనిపించలేదు. పదహా(ర్రూపాయల టిక్కెట్టూ... ఇరవై నిమిషాల టైమూ ఖర్చు చేసి బన్నూరు చేరాం.

అప్పుడు టైమ్ పదింబావయింది. ఇంకేముంది? ఇంకో పావుగంటలో సోమనాథపురం వెళ్తే... ఓ గంట అక్కడ గుడి చూసుకుని... మళ్ళీ అరగంటలో వెనక్కి వెళ్ళిపోతే... ఓ! బోలెడంత టైమ్... అని హుషారుగా అనుకుంటున్న నా లెక్క కాసేపట్లోనే తప్పింది.

అరగంటపైగా బస్‌స్టాప్‌లో నిల్చున్నా సోమనాథపురం వెళ్ళే ప్రయివేట్ బస్ ఏదీ రాలేదు. కాసేపు చూసి “ఏవండీ! ఆటోలో వెళ్దామా!” అన్నాను.

ఆటో అతని దగ్గరికి వెళ్ళి సోమనాథపురం అంటూండగానే... “దింపి రావడానికైతే యాభై... మళ్ళీ వెనక్కి రావాలంటే ఎనభై” అన్నాడతను కన్నడంలో.

“ఏమిటీ! పది కిలోమీటర్లకే!” అని మేమిద్దరం తెలుగులో ఆశ్చర్యపోయాం.

తప్పు విన్నామేమోనన్న అనుమానంతో మావారు మరోసారి “సోమనాథ పురం” అన్నారు.

అతను కూడా తన రెండు అంకెల్నీ రిపీట్ చేశాడు. మేం మొహాలు చూసుకున్నాం. మావారు మళ్ళీ అతని వైపు తిరిగి బేరం మొదలు పెట్టారు.

అయిదు నిమిషాలు చర్చ జరిగాక అతను చాలా ఉదారంగా అయిదు రూపాయలు తగ్గించాడు. దానికి సమర్థింపుగా కన్నడంలో తన కష్టాలన్నీ ఏకరువు పెట్టాడు.

మక్కీకి మక్కి అర్థం కాకపోయినా “నేను చాలా న్యాయంగానే అడిగాను. ఇంతకంటే తక్కువకి రావడం కుదరదు” అన్నది అతని భావమని అవగతమయింది.

రెండు క్షణాలు మౌనంగా నిల్చున్న తర్వాత “సరే. వెళ్దాం పదండి” అన్నాను.

మేమిద్దరం కూర్చోగానే పచ్చటిపొలాల మధ్యగా ఆటో పరుగులు మొదలెట్టింది. చెప్పద్దూ! ఆటో ఎక్కిన రెండో నిమిషంలోనే డెబ్బై అయిదు రూపాయల మాట మర్చిపోయేలా వుంది ప్రకృతి.

గతుకుల రోడ్లే అయినా... ఊరు కాని ఊర్లో మేమిద్దరం అలా ప్రయాణించడం చాలా బాగా అనిపించింది. హైదరాబాద్‌లో ఎప్పుడూ ఉక్కిరిబిక్కిరయ్యే ట్రాఫిక్ పొగల మధ్య... వెన్ను నొప్పి పుడుతూ స్కూటర్ మీద తిరగడమేగా!

గమ్యానికి చేర్చి ఆటో ఆగగానే... "అప్పుడే వచ్చేశామా!" అని కాస్తంత బాధ వేసింది కూడా.

కానీ గుడిలోకి వెళ్ళగానే ఆ బాధా తీరిపోయింది. అద్భుతమయిన శిల్పకళా చాతుర్యాన్ని చూసి పరవశిస్తూ... ఆ శిల్పాల అందాన్ని ఫోటోల్లో బంధించుకుంటూ దాదాపు గంటసేపు మైమరచి తిరిగాము ఆవరణంతా.

మూడు గర్భగుడులు... వాటిల్లో రెండు ఒరిజినల్ విగ్రహాలనీ... మూడవది తస్కరింపబడితే... ఆ స్థానంలో డూప్లికేట్ విగ్రహాన్ని పెట్టారని... ఎవరో విదేశీ జంటకి ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నాడు గైడ్.

ఈ రెండు విగ్రహాలే ఇంత బాగున్నాయంటే... తస్కరింపబడిన మూడో విగ్రహం ఇంకెంత బాగుండి వుంటుందో అనిపించింది.

ఎక్కువమంది జనం లేరు. పూజలు జరగని గుడి కావడం వల్లనేమో!... అంత కళ కూడా లేదు. కానీ ఏదో చిరపరిచితమయిన వాతావరణం. పరాయి రాష్ట్రంలో స్వగృహానికి వచ్చిన అనుభూతి.

ఫారిన్ జంటలో అతను చాలా శ్రద్ధగా గైడ్ చెప్పేది వింటూ గైడ్ వెనకే వడివడిగా నడుస్తున్నాడు. ఆ అమ్మాయి మాత్రం మెల్లగా పక్కకి తప్పుకుని... తనపాటికి తను శిల్పాల్ని చూస్తూ నింపాదిగా నడవసాగింది.

మా రెండు జంటలూ కాకుండా మరొక వ్యక్తి వచ్చాడు గుడికి. పచ్చని శరీరం... పొట్టిగా వున్నాడు. ఒక చేతిలో చిన్న బ్రీఫ్‌కేస్. మెడలో కెమెరా. హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ, ఫోటోలు తీసుకుంటూ... విదేశీ అమ్మాయిని ఇంగ్లీషులో పలకరించాడు. "ఎలా వుంది గుడి!" అని.

"ఎక్స్‌లెంట్" అంది ఆ అమ్మాయి.

ఆయన ఆ అమ్మాయితో మాట్లాడే ధోరణి.. ఇంగ్లీషు ఉచ్చారణా చూస్తే... ఇతను కూడా ఫారిన్‌లో సెటిలయిన బాపతేనేమో అనిపించింది.

నా ఊహ నిజమే.

రెండు నిమిషాల తరువాత మావారి దగ్గరికి వచ్చి పరిచయం చేసుకున్నాడు ఆయన. "నా పేరు శ్రీనివాస్ అయ్యంగార్" అంటూ. కెనడాలో వుంటారట.

"మీరు ఆటోలో వచ్చారా!" అని అడిగాడు మావారిని. అవునన్నారీయన.

"ఎంత యిచ్చారు!" అని ఆయన అడగగానే... "డెబ్బై అయిదు" అన్నారు మావారు చాలా సాధారణంగా.

ఆయన మొహం ఆశ్చర్యంగా పెట్టి, పెదవుల్ని అసంతృప్తిగా విరిచాడు. "టూ మచ్" అన్నాడు కళ్ళు పెద్దవి చేసి.

మావారు తప్పు చేసిన వాడిలా మొహం పెట్టారు. డెబ్బై అయిదు రూపాయలు ఇవ్వడం ఎంత తెలివితక్కువో ఆయన ఘాటుగా చెప్తుంటే... మావారు బిక్కమొహం వేసి, "నా వైఫ్ మళ్ళీ ఒంటిగంట అయ్యేసరికి మైసూర్‌లో వుండాలి. భోజనం చేసి హైదరాబాద్ బస్ ఎక్కాలి" అని బెరుకు బెరుకుగా సంజాయిషీ ఇచ్చారు.

కానీ ఆయన ఆ సంజాయిషీకి ఏ మాత్రం సంతృప్తి చెందని వాడిలా మొహం పెట్టి "ఏమైనా డెబ్బై అయిదు రూపాయలు చాలా ఎక్కువ" అన్నాడు.

నేను మావారి చేయి పట్టుకుని లాగి "ఏవండీ! గుడి మొత్తం వచ్చేటట్లు ఒక ఫోటో తీసుకుందాం" అన్నాను.

కొద్ది చోటులోనే తనివితీరా శిల్పాలు చెక్కుకునేందుకు వీలుగా నక్షత్రాకారంలో ఏర్పరిచారు గుడి ఆకారాన్ని.

మావారు కెమెరా ఆయన చేతిలో పెట్టి "ప్లీజ్" అన్నారు.

మా ఇద్దరికీ కలిపి ఒక ఫోటో తీశాడాయన. ఆ తరువాత అడిగాడు. "వెళ్ళేటప్పుడు నేను కూడా మీతో రావచ్చా!" అని.

"ఆఁ. ఆఁ. రావచ్చు. ఆటో అతన్ని అడిగి" అన్నారు మావారు. మావారి అమాయకత్వానికి నేను తల కొట్టుకున్నాను. ఆటో అతన్ని అడిగేదేముంది! ముగ్గురికంటే ఎక్కువయితే గొడవ చేస్తాడేమో కానీ ఇద్దరి బదులు ముగ్గురు కూర్చుంటే అతనేమీ పోట్లాడడు కదా!

"నేనేం ఇవ్వాలి!" అన్నాడాయన.

"ఆటో అతన్ని అడుగుదాం" అన్నారు మావారు. ఈసారి నాకు అనుమానం వచ్చింది. మావారు అమాయకంగా మాట్లాడుతున్నారా! లేక ఆయన మాతో రావడం ఇష్టం లేక గడుసుగా మాట్లాడుతున్నారా! అని.

నిజం చెప్పాలంటే ఆయన మాతో రావడం నాకూ ఇష్టం లేదు. వచ్చేటప్పుడు ఎంజాయ్ చేసిన ఏకాంతాన్ని వెళ్ళేటప్పుడూ ఎంజాయ్ చేయాలని వుంది నాకు. కానీ పాపం ఆయన నోరు తెరిచి అడిగాడు కదా! అని వూరుకున్నాను. ఆ సంభాషణలో పాలు పంచుకోకుండా కొంచెం దూరంగా నడిచాను. నిమిషం తర్వాత మావారు నన్ను అనుసరించారు.

మరో నాలుగు శిల్పాలు చూసి మేము ఇవతలికి వచ్చేసరికి శ్రీనివాస్ అయ్యంగార్ కనపడలేదు. మేము గుడి బయటకు వచ్చేసరికి మా ఆటో రెడీగా వుంది. ఆయన కోసం నాలుగువైపులా చూశాం. ఉహూ. జాడే లేదు. ఒక అయిదు నిమిషాలు చూసి ఆయన కనపడకపోవడంతో ఆటో ఎక్కేశాం.

"పాపం! ఆయన మనకోసం వెతుకుతున్నాడేమో!" అన్నాను నేను ఆటో కొంత దూరం వచ్చాక.

"ఏం చేస్తాం మరి! మనకి టైమ్ అయిపోతోంది కదా!" అన్నారు మావారు.

ఇలా బాధపడుతూ మేము బన్నూరు చేరేసరికి అక్కడ మళ్ళీ ఆయన ప్రత్యక్షం. ఆటో దిగి డబ్బులిచ్చి, వెనక్కి తిరిగి చూస్తే... మరెవరితోనో గడగడా మాట్లాడుతూ కనిపించాడు.

"బస్సెప్పుడొస్తుందో!" అని మేము దిగులు పడుతూండగా మాకు దగ్గరగా ఒక వ్యాన్ లాంటిది వచ్చి ఆగింది.

"మైసూర్, మైసూర్" అని అరుస్తున్నాడు డ్రైవర్.

శ్రీనివాస్ అయ్యంగార్ మాకు దగ్గరగా వచ్చి "గుడిలోనుంచి బయటకు రాగానే బస్ కనిపించింది. అందులో వచ్చాను. జస్ట్ త్రీ రుపీస్ టికెట్‌తో" అన్నాడు దర్పంగా.

మావారు తన తెలివితక్కువతనానికి దిగులుపడుతున్నవారిలా మొహం పెట్టారు. పన్నెండు రూపాయలు ఖర్చుపెట్టాల్సిన చోట డెబ్బై అయిదు రూపాయలు ఖర్చుపెట్టామన్న బాధ కన్నా.. ఆ విషయాన్ని ఆయన పదే పదే ఎత్తిపొడిచినట్లుగా చెప్పడం మరీ దుర్భరంగా వుంది మావారికి.

నాకు అంతకన్నా వళ్ళు మండింది. "గుడి దగ్గర ఆయన కోసం వెతుకుతూ మేము అయిదునిమిషాలు టైం వేస్ట్ చేసుకుంటే ఆయన మాత్రం బయటకి వచ్చీ రాగానే బస్ ఎక్కేశాడన్నమాట! పైగా దాని గురించి గొప్పగా చెపుతున్నాడింకా!" అనుకున్నాను.

మాతో మాట్లాడటం అయ్యాక వ్యాన్ డ్రైవర్ దగ్గరికి వెళ్ళి వివరాలు అడగడం మొదలుపెట్టాడు ఆయన.

బయల్దేరే టైమూ, రేటూ వగైరా కనుక్కున్నాక చెంగున వ్యాన్‌లోకి దూకి కూర్చున్నాడు.

అప్పటికి ఆయన తెలివితేటలమీద గొప్ప నమ్మకం కలిగిందేమో... మావారు కూడా అదే స్టైల్లో వ్యాన్‌లోకి దూకారు. నాకు ఆయన్ని అనుసరించక తప్పలేదు.

"ఆవిడ్ని విండోసీటు దగ్గర కూర్చోనివ్వండి. వీడు బోలెడుమంది జనాన్ని కూరేస్తాడు. ఆవిడకి ఇబ్బందవుతుంది" అన్నాడాయన మావారితో.

ఆయన దూరదృష్టిని అబ్బురంగా గమనిస్తూ మావారు నన్ను విండోసీటు దగ్గర కూర్చోపెట్టారు.

అప్పటికి వ్యాన్‌లో మేము ముగ్గురమే. కానీ ఆ తరువాత నిజంగానే ఆయన చెప్పినట్లు ఆ చిన్న వ్యాన్‌లోకి మేకపిల్లల్ని తోసినట్లుగా జనాన్ని తోశారు. వ్యాన్ బయల్దేరాక కూడా అదే తంతు. దిగేవాళ్ళు లేరు కానీ ఎక్కేవాళ్ళు మాత్రం గుంపులు గుంపులు.

మా ఎదురుగా వున్న విండోసీటు దగ్గర కూర్చుని శ్రీనివాస్ అయ్యంగార్ ఎడతెరిపిలేకుండా కబుర్లు చెప్పసాగాడు.

మావారు శ్రద్ధగా వింటూ సందేహాలు తీర్చుకుంటున్నారు.

నేను మాత్రం ఒక చెవి అటువేసి, మరీ బోరు కొట్టినప్పుడు విండోలోనుంచి బయటకి చూస్తూ కాలక్షేపం చేయసాగాను.

ఆయన చెప్పని విషయాలు లేవు. కెనడాలో జీవితం, ఆయన బిజినెస్సూ, వాళ్ళావిడ వుద్యోగం... ఇండియాలో రకరకాల కంపెనీల్లో ఆయనకి వున్న షేర్లూ... ఒకటి కాదు... ఎన్నో విషయాలు.

ఏం చెప్పినా ఆ మాటల సారాంశం ఒకటే. డబ్బు... దాని ప్రాముఖ్యత. ఆయన ఉద్దేశ్యం ప్రకారం మనిషికి ఉండాల్సిన మొదటి ధ్యేయం డబ్బు సంపాదించడం. రెండో ధ్యేయం ఆ డబ్బుని పొదుపుగా వాడటం. మూడో ధ్యేయం ఉన్న డబ్బుని పెంచుకునే ఆలోచనలు చేయడం.

మనుషులకీ, జంతువులకీ వుండే తేడా అదేననీ... మనుషుల్లో అయితే ఈ మూడు లక్షణాలూ వుంటాయనీ, జంతువుల్లో వుండవనీ ప్రగాఢంగా నమ్ముతున్న వాడిలా వున్నాడాయన.

మా ఇద్దర్నీ కూడా జంతువుల జాబితాలోనే లెక్క వేసినట్లున్నాడు.

ఫారిన్ వెళ్ళే ప్రయత్నంకానీ, కనీసం ఆలోచన కానీ లేని మా అమాయకత్వానికి చాలా జాలీ, కొంచెం చిరాకూ చూపించాడు. ఫారిన్ వెళ్ళే మార్గాలూ, పద్ధతులూ వగైరా ఏకరువు పెట్టాడు. వెంటనే ఫారిన్ వెళ్ళే ప్రయత్నాలు చేయమని ఉద్బోధించాడు.

ఆయన ధోరణి నాకు చాలా విసుగు కలిగించింది. కానీ తప్పించుకునే మార్గం లేదు. వ్యాన్ దిగే అవకాశం కాదు కదా కనీసం వ్యాన్‌లోనే ఒక అర అంగుళం పక్కకి జరిగే అవకాశం కూడా లేదు.

అరగంట, నలభై నిమిషాలు దాటినా... మైసూర్ సమీపిస్తున్న సూచనే లేదు. "ఏంటి! వచ్చేటప్పుడు వచ్చిన రూట్‌లో వెళ్తున్నట్లు లేదే!" అన్నాను మావారి వైపు తిరిగి.

చాలాసేపటి తర్వాత నేను గొంతు విప్పగానే సీరియస్‌గా మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దరూ నా వైపు తిరిగారు. "లోపల్లోపలి పల్లెటూర్లన్నీ తిప్పుతున్నట్లున్నాడు" అన్నాను నేను.

"అవునా!" అని అడిగితే నిజమేనన్నాడు డ్రైవర్.

"ఆర్.టి.సి బస్‌రూట్ వేరు. మా రూట్ వేరు" అన్న అతని సమాధానం విని నేను నిట్టూర్చాను.

"పెద్ద తెలివైనవాడిలా కళ్ళు మూసుకుని ఈ వ్యాన్ ఎక్కించారు. చూడండి. మైసూర్ వెళ్ళేసరికే మూడు దాటేటట్లుంది" అన్నాను చిరాగ్గా మొహం పెట్టి.

తెలుగులో నేనన్న మాటలు క్లియర్‌గా అర్థం కాకపోయినా భావం అర్థమయినట్లుంది శ్రీనివాస్ అయ్యంగార్‌కి.

అప్పటివరకూ ఆ వ్యాన్‌లో ఎక్కి డబ్బు ఆదా చేయడాన్ని గొప్పగా ఫీలవుతున్న మనిషి నా మాటలతో ప్లేటు ఫిరాయించాడు. వ్యాన్‌లో అంతమంది జనాన్ని ఎక్కించడం గురించీ, లాంగ్‌రూట్‌లో తీసుకెళ్ళడం గురించీ చిరాకు పడ్డాడు. అందుకే అసలు ఇండియాలో వుండడమే ఒక పెద్ద తలనొప్పి అన్నాడు. ఈ విపరీతమయిన జనాభా... ఈ గోల... ఇదంతా హారిబుల్ అన్నాడు.

నేను మొహం చిట్లించి కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చున్నాను. ఒక రెండు నిమిషాలు కామ్‌గా కూర్చుని మళ్ళీ మాటలు మొదలుపెట్టాడు శ్రీనివాస్ అయ్యంగార్.

తన మెడలో వున్న కెమెరాని దర్పంగా చూపిస్తూ... అది ఎంత పవర్‌ఫుల్ కెమెరానో, దానికున్న ఫీచర్స్ ఏమిటో వివరించసాగాడు.

మావారు కళ్ళు ఇంతింత చేసుకుని ఆ మాటలకి రెస్పాండ్ అవబోతూ వుంటే... నేను వీలయినంత గయ్యాళితనాన్ని గొంతులోకి తెచ్చుకుని "వెధవ వ్యాను. ఇక ఈ పూట భోజనం కూడా దొరికేలా లేదు. మైసూర్ వెళ్ళీ వెళ్లడమే ఆదరాబాదరాగా హోటల్లో నుంచి సామాను తెచ్చుకుని హైదరాబాద్ బస్ ఎక్కాలి కాబోలు!" అన్నాను.

ఆ దెబ్బతో ఇద్దరూ టక్కున నోరు మూసుకున్నారు.

మరో పది నిమిషాలకు మైసూర్ చేరాం. వ్యాన్ దిగి టైం చూస్తే రెండూ పది. మావారి మొహంలోకీ, అంతకన్నా ఎక్కువగా శ్రీనివాస్ అయ్యంగార్ మొహంలోకీ వెలుగొచ్చింది.

"మీ బస్ ఎన్ని గంటలకి!" అని అడిగాడు.

"నాలుగున్నరకి" అన్నారు మావారు.

"ఓ చాలా టైముంది" అన్నాడాయన రిలీఫ్‌గా.

"మీరేమైనా తినేసి హాయిగా బస్సెక్కచ్చు" షేక్‌హ్యాండిస్తూ చెప్పాడు.

"ఫారిన్ వెళ్ళే ప్రయత్నం చేయండి. సంపాదించడానికీ, ఎంజాయ్ చేయడానికీ ఇదే సరైన వయసు. హైదరాబాద్ వెళ్ళగానే సీరియస్‌గా ఆలోచించండి" అన్నాడు.

మావారు తలూపారు.

"టైం వేస్ట్ చేయకండి. వెంటనే డెసిషన్ తీసుకోండి. మనం చేసే పనులకి ఎప్పుడూ ఒక ధ్యేయం వుండాలి. ఏ పని చేసినా ఒక లక్ష్యంతో చేయాలి. ఇండియాలో లేనిదీ, ఫారిన్‌లో వున్నదీ అదే. నేను అక్కడికి వెళ్ళి నేర్చుకున్న సిద్ధాంతం అదే. అందుకే ఇండియా వచ్చినా నేను వారం రోజులకంటే ఎక్కువ వుండలేను. నా సిద్ధాంతాలకీ, ఏ లక్ష్యమూ లేని ఇక్కడి జీవిత విధానానికీ పొత్తు కుదరదు..."

ఆయన మాటలు పూర్తవుతూండగానే నేను రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాను. "మిమ్మల్ని కలవడం చాలా సంతోషాన్ని కలిగించింది. మీలా గొప్ప సిద్ధాంతాలు అలవర్చుకున్నవాళ్ళు ఏ పని చేసినా ఒక ధ్యేయంతో చేస్తారని ఈ

రోజే అర్థమయింది. మీరన్నది నిజమే. మీ సిద్ధాంతాలకీ, భారతీయ సిద్ధాంతాలకీ ఎప్పటికీ పొత్తు కుదరదు".

అప్పటివరకూ గయ్యాళిలా కనబడిన నేను, ఉన్నట్లుండి అలా స్పష్టంగా, గౌరవంగా, వినయంగా మాట్లాడుతుంటే ఆయన ఆనందంగా చూడసాగాడు.

జోడించిన చేతులు మెల్లగా కిందికి దించుతూ నేను నా మాటలు కొనసాగించాను.

"ఎందుకంటే... మీకు ఏ పనిలోనయినా డబ్బు సంపాదనో, సుఖమో... ఏదో ఒక ధ్యేయం నెరవేరితే చాలు. కానీ ఇక్కడ అలా కాదు. వీళ్ళకి ఏ పని చేసినా పుణ్యమూ, పురుషార్థమూ రెండూ దక్కాలి. అసలు ఆ పురుషార్థాలే నాలుగు. మీకు తెలిసిన అర్థమూ, కామమూ అనే రెండింటితో పాటు ధర్మమూ, మోక్షమూ అనే మరో రెండు పురుషార్థాలు కూడా కావాలి వీళ్ళకి. అంటే... భారతీయ సిద్ధాంతాలు అలవరచుకున్న వాళ్ళకి మీకన్నా అయిదురెట్లు ఆశ ఎక్కువ. ఒక పని చేయబోయేముందు వీళ్ళు వేసే లెక్కలూ ఎక్కువే.

అందుకే వీళ్ళకీ, మీకూ పొత్తు కుదరడం ఎప్పటికీ సాధ్యం కాదు. వీళ్ళు మీ వేగాన్ని ఎప్పటికీ అందుకోలేరు".

గడగడా ఆ మాటలు చెప్పేసి, ఆయన పాలిపోయిన మొహం వైపు మరి చూడకుండా వెనుదిరిగాను.

<u>రచనాకాలం : 2002</u>